# అన్ని రంగాల్లోనూ రాణిస్తున్న మహిళలు



భీమడోలు : ఎంపీడీఓ పద్మావతిదేవికి సత్కారం

**భీమడోలు:** పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. పోలసానిపల్లి రైతు సేవా కేంద్రం వద్ద సర్పంచ్ షేక్ రహీమాబేగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ హాజరై మాట్లాడారు. మహిళా ఉద్యోగులను దుశ్శాలతో సత్కరించారు. సర్పంచ్ రహీమాబేగం, ఎంపీటీసీ అంబటి దేవి, ఎంపీడీఓ పద్మావతిదేవిలను పెద్దలు ఘనంగా సన్మానించారు. పెద్దలు గంజి సుబ్బారావు, మద్దు శ్రీను, వి.గోవిందరావు, భీమడోలు రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి జయరామకృష్ణ, హెచ్ఎంలు కె.తులసి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

**మహిళాభ్యున్నతితోనే అభివృద్ధి**

**గణపవరం:** మహిళలు అభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. పిప్పర పీహెచ్సీలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో వైద్యాధికారిణి కె.ప్రియాంక, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ ఇందుకూరి రామకృష్ణంరాజు మాట్లాడారు. మహిళావైద్య సిబ్బందిని సత్కరించారు. గణపవరం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, మహిళా ఉద్యోగులను సత్కరించారు. అఖిలభారత హ్యాండ్లూమ్స్ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**నారాయణపురంలో..**

**ఉంగుటూరు:** నారాయణపురం సచివాలయం వద్ద మహిళలకు సర్పంచ్ దిడ్ల అలకానంద ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు. ఉంగుటూరులో అంగన్వాడీలను సర్పంచ్ సింధు సత్కరించారు.

**స్కేటర్ జెస్సీరాజ్‌కు సత్కారం**

**దెందులూరు:** ఇంటర్నేషనల్ స్కేటర్ ప్రధాన మంత్రి బాల పురస్కార అవార్డు గ్రహీత ఎం జెస్సీరాజ్‌ను శనివారం అమరావతిలో ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి సత్కరించి జ్ఞాపికను అందజేశారు. తొమ్మిదో తరగతిలోనే అవార్డు పొందిన జెస్సీ బాలలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. సోమవరప్పాడు సెయింట్ జాన్స్ విద్యా సంస్థల్లో అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. పురుషులకు సమానంగా మహిళలు ఖ్యాతి గడిస్తున్నారని వికార్ జనరల్ డాక్టర్ బాల అన్నారు.



దెందులూరు : జెస్సీరాజ్‌ను సత్కరించిన దృశ్యం

**సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీలో..**

**పెదవేగి :** సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కాలేజీ మహిళా సాధికారత కమిటీ ఆధ్వర్యంలో మహిళా సిబ్బందిని, బోధనా సిబ్బందిని సత్కరించారు.




# ఘనంగా అమ్మవార్ల ఊరేగింపు

**భీమడోలు:** జాతర మహోత్సవాల్లో భాగంగా అఖరి ఘట్టంలో శనివారం రాత్రి అమ్మవార్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో గరగల నృత్యాలు, నెమలి డ్యాన్స్, బుట్ట బొమ్మల డ్యాన్స్, కోయ డ్యాన్స్, రామడోలు, నీరణం, తీన్మార్ డప్పు వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. పంబలి కథ చెప్పినతర్వాత కుంభం పోసే కార్యక్రమం నిర్వహించారు. పోలిమేట తిరిగింది. భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. శుక్రవారం రాత్రి మద్దిరామమ్మ సంబరం, అనంతరం అమ్మవారిని సాగనంపే కార్యక్రమం నిర్వహించారు.

**నేటితో ముగింపు**

పుష్కర కాలానికి ఒకసారి జరిగే భీమడోలు జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగియనున్నాయి.



అమ్మవారిని సాగనంపుతున్న దృశ్యం

గ్రామంలోని ఇళ్లన్నీ బంధుమిత్రులతో కళకళలాడుతున్నాయి. లక్షలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకోనున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 130 మంది పోలీసులు పహారా కాస్తున్నారు. రైల్వే గేటు మూసేయడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.



ఊరేగింపులో శక్తి వేషాలు

**కేటరింగ్ భోజనాలే ముద్దు**

జాతరకువచ్చే బంధుమిత్రులకు రుచికరమైన భోజనం పెట్టేందుకు గ్రామస్తులు ఉవిళ్లూరుతున్నారు. బూరెలు, గారెలు, స్వీట్లు, మటన్, రొయ్యల బిర్యానీ, నాటు కోడి కూరలతో పసందైన భోజనాలకు ఆర్డర్ ఇచ్చారు.

## విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు



విగ్రహానికి పూజ చేస్తున్న వేదపండితులు

**నిడమర్రు:** బువ్వనపల్లి జగ్గయ్యచెర్వు వద్ద నిర్మించిన వేణుగోపాల స్వామి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా శనివారం రెండో రోజు వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి నూతన ఆలయం వరకు వేణుగోపాల స్వామి విగ్రహాన్ని ఊరేగించారు. మహిళలు మంచినీటి చెరువు నుంచి బిందెలతో నీరు తెచ్చి స్వామివారికి అభిషేకించారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, చినబాబు, కన్నబాబు, కార్తీక్, ప్రముఖ దాత సంకు పుల్లయ్య, కృష్ణాజీ, రాజా తదితరులు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు.

## మారెమ్మ గవళ్లగుడుపు సేవ

**గణపవరం:** గణపవరం గ్రామ దేవత దండు మారెమ్మ జాతర మహోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. రాత్రి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి గవళ్లగుడుపు సేవ నిర్వహించారు. ఉత్సవాలు ఈనెల 16 వరకు కొనసాగుతాయి.

## 12న ఉపాధి కార్మికుల మహా ధర్నా

**పెదవేగి :** ఉపాధి హామీ పథకంలో 100 రోజుల పని పూర్తి చేసుకున్న పేదలకు అదనంగా పని దినాలు సమ్మర్ అలవెన్స్, పేస్లిప్‌లు, పెండింగ్ బిల్లులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయవాడలో ఈనెల 12న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని రవి కోరారు. శనివారం అమ్మపాలెం గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు.

## ఆలయ వార్షికోత్సవాలు



వెంకటేశ్వర స్వామి

**దెందులూరు:** స్థానిక లైబ్రరీ సెంటర్‌లో వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి వివిధరకాల పుష్పాలతో అలంకరించారు. కొర్లిపర కుటుంబసభ్యులు కల్యాణం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

## పల్లాలమ్మకు కుంకుమ పూజ

**ఉంగుటూరు:** రాచూరు గ్రామ దేవత పల్లాలమ్మ ఆలయ ఉత్సవాల్లో భాగంగా శనివారం రెండో రోజు సూర్య నమస్కారాలు, మహాలింగార్చన, నీరాజన మంత్రపుష్పం, సామూహిక కుంకుమ పూజలు, వేద స్వస్తి, వంటి పూజలు చేశారు. ఎమ్మెల్యే ధర్మరాజు, మహిళలు పల్లాలమ్మవారిని దర్శించుకున్నారు.

## విద్యా సామగ్రి పంపిణీ

**దెందులూరు:** స్థానిక బాలసదనంలో విద్యార్థులకు తేజ అభి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ స్వరూపా రాణి ఆధ్వర్యంలో పుస్తకాలు, పండ్లు, కేకులు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కెథ్రడల్ డైరెక్టర్, ఫాదర్ ఐ.మైకేల్ మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. బాలసదను సూపరింటెండెంట్ సరోజిని దోమతోటి విజయలక్ష్మి, కొత్తపల్లి రమ్య, సృజన, కవిత, బాలసుబ్రమణ్యం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.